క్లుప్తంగా

రైల్వే అలైన్‌మెంట్ సర్వే అడ్డగింపు



గుడిమెళ్లంకలో రైల్వే అలైన్‌మెంట్ సర్వేను అడ్డుకున్న గ్రామస్తులు

మలికిపురం: మండలంలోని గుడిమెళ్లంక గ్రామంలో రెండో రోజు గురువారం రైల్వే అలైన్‌మెంట్-6 కోసం అధికారులు చేపట్టిన సర్వేను స్థానికులు అడ్డుకున్నారు. ఈ అలైన్‌మెంట్ మార్చాలని, స్థానిక సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, పెద్దలు పాల్గొన్నారు.

స్వామియే శరణం అయ్యప్ప



ముహుర్తాల చెరువుగట్టులో కలశ పూజ చేస్తున్న అయ్యప్ప స్వాములు

మామిడికుదురు: అయ్యప్ప శరణు ఘోషతో శివాలయాలు మార్మోగాయి. 41 రోజుల మండల దీక్ష పూర్తి చేసుకున్న స్వాములు గురువారం ఇరుముడులు కట్టించుకుని శబరిమలకు బయలు దేరారు. అప్పనపల్లి శ్రీఅన్నపూర్ణ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద 17 మంది, పాశర్లపూడి శివాలయం వద్ద 10 మంది, గెద్దాడలో 25 మందికి ఇరుముడులు కట్టారు. గురుస్వాములు కొర్లపాటి రామారావు, వర్ధినేని సత్య శ్రీనివాస్‌లు మండల దీక్ష పూర్తి చేసిన స్వాములకు ఇరుముడులు కట్టారు.

వైభవంగా కలశ పూజ

అంబాజీపేట: అయ్యప్పస్వామికి 108 కలశ పూజ, పడిపూజ బుధవారం రాత్రి గంగలకుర్రు కుమ్మర గరువు, మాచవరం శివారు ముహుర్తాలు చెరువుగట్టు వద్ద వైభవంగా జరిగింది. కుమ్మరి గరువులో చిరుతపూడి వెంకటేశ్వరరావు, సత్యనారాయణ స్వామి, రాంబాబు స్వామిలచే ఈ పూజ ఆద్యంతం కనుల పండువలా నిర్వహించారు. ముహుర్తాల చెరువు గట్టు వద్ద మట్టపర్తి రాంబాబు కుమారుడు సాయి ఈశ్వర్ ఇంటి వద్ద 11 కలశల పూజ ఘనంగా జరిపారు. స్వాములు ముందుగా పేటతుల్లి ఆడారు. అయ్యప్ప స్వామికి

సహకార వ్యవస్థ బలోపేతానికి కృషి



కొత్తపేటలో మాట్లాడుతున్న డీసీసీబీ బీఎం సత్యనారాయణ

కొత్తపేట: సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని స్థానిక డీసీసీబీ బీఎం ఏఎస్‌వీ సత్యనారాయణ అన్నారు. అఖిల భారత సహకార వారోత్సవాలు గురువారం కొత్తపేటలో ఘనంగా ప్రారంభించారు. స్థానిక డీసీసీబీ బ్రాంచ్ కార్యాలయం వద్ద, పీఏసీఎస్ కార్యాలయం వద్ద సప్తవర్ణ సహకార పతాకాలను బీఎం సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో సహకార వ్యవస్థ గణనీయమైన పాత్ర పోషిస్తుందన్నారు. గతంలో సహకార బ్యాంకులు రైతులకు పంట రుణాలు మాత్రమే అందించేవన్నారు. నేడు కమర్షియల్ బ్యాంకులకు ఏమాత్రం తీసిపోని విధంగా రైతులకు కావాల్సిన వివిధ రుణాలు తక్కువ వడ్డీకి ఇస్తున్నాయన్నారు. డీసీసీబీ సూపర్‌వైజర్ ఎస్.బాలగణేశ్వరరావు, కొత్తపేట పీఏసీఎస్ సీఈఓ జగత ప్రసాద్, వానపల్లి, అవిడి, రాకుర్తివారిపాలెం, పలివెల, గంటి సీఈఓలు బీవీవీ సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, కె.శ్రీకాంత్, కె.చక్రపాణిరావు, ఎన్.సురేష్ పాల్గొన్నారు.

లబ్ధి జమ చేయాలని డిమాండ్



ఎంపీ హరీష్ మాధుర్‌కు తమ డిమాండ్‌ను వివరిస్తున్న చేనేత కార్మికులు

అయినవిల్లి: కేంద్ర ప్రభుత్వ పథకం 'హాత్ ఖార్గ్ సంవర్ధక సహాయక్' ద్వారా నిర్మించుకున్న షెడ్లకు ఇచ్చే లబ్ధిని వెంటనే తమ ఖాతాల్లో జమ చేయాలని చేనేత కార్మికులు డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్‌ను కలసి సమస్యను విన్నవించారు. అయినవిల్లి జెడ్పీటీసీ మాజీ సభ్యులు గంగుమళ్ల అన్నపూర్ణ, జీఎంసీ బాలయోగి ట్రస్ట్ చైర్మన్ గంగుమళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ పథకంలో ఎంపికైన అయినవిల్లి మండలానికి 42 మంది చేనేత కార్మికులు కలిశారు. ఆర్థిక లబ్ధిని తక్షణమే విడుదల చెయ్యాలని, తమ జీవనోపాధి మెరుగుకు సహకరించాలని కోరారు. అనంతరం చేనేత, జౌళీ శాఖ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా హరీష్ ఎంపికవ్వడంతో సత్కరించారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు అంకం వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

చినుకు.. వణుకు

- వంటలపై అల్పపీడనం ప్రభావం
- ఈదురు గాలులకు నేలకొరిగిన చేలు
- 19,765 ఎకరాల్లో సాగుకు ఇబ్బంది



మామిడికుదురులో పనలపై కప్పిన బరకాలు

మామిడికుదురు: విత్తు నుంచి వంట చేతికందే వరకూ పుడమి పుత్రులకు కష్టాలే.. అడుగడుగునా ఆటంకాలే.. ఎన్నో ఆశలతో పచ్చని సిరులు పండించేందుకు అడుగులు వేసిన రైతన్నలను ప్రకృతి వైపరీత్యాలు కుంగదీస్తున్నాయి.. ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వారికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. రెండు రోజుల నుంచి కురుస్తున్న వానలు ఆందోళన రేకెత్తిస్తున్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఖరీఫ్ కోతలు ప్రారంభమయ్యాయి. పంట మొత్తం కోత దశకు చేరింది. ఈ పరిస్థితుల్లో ఈదురు గాలులు వీయడంతో పాటు అడపాదడపా వానలతో పంట వెన్ను బరువెక్కి నేల కొరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే దిగుబడి గణనీయంగా తగ్గుతుందని వాపోతున్నారు. ఎటువంటి ఒడిదొడుకులు లేకుండా పంట చేతికొచ్చిందని, ఈ పరిస్థితుల్లో అల్పపీడనం కుంగదీస్తుందని రైతులు కంగారు పడుతున్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 19,765 ఎకరాల విస్తీర్ణంలో ఖరీఫ్ సాగు చేశారు. అయినవిల్లి మండలంలో అత్యధికంగా 8,112 ఎకరాల్లో వరి పండించారు. పి.గన్నవరం మండలంలో 6,078, అంబాజీపేట మండలంలో 3,006, మామిడికుదురు మండలంలో 2,569 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. పి.గన్నవరం మండలంలో ఇప్పటికే కోతలు ఊపందుకోగా, మామిడికుదురు మండలంలో కోతలు ప్రారంభమయ్యాయి. అంబాజీపేట, అయినవిల్లి మండలాల్లో పంట కోత దశకు వచ్చింది. ఈ రెండు మండలాల్లో రైతులు ఇప్పుడిప్పుడే కోతలకు సిద్ధమవుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రతికూల వాతావరణం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రతి ఏటా ప్రభుత్వం రాయితీపై ఇచ్చే బరకాలు కూడా ఇంత వరకూ రాలేదని కర్షకులు వాపోతున్నారు. బరకాలు అందుబాటులో ఉంటే వర్షం బారి నుంచి పంటను రక్షించుకునేందుకు ఉపయోగపడతాయని చెబుతున్నారు.



మామిడికుదురులో ట్రాక్టర్‌పై సురక్షిత ప్రాంతానికి పనల తరలింపు

అధిక వర్షం కురిస్తే నష్టాలే..



నేను 60 ఎకరాల విస్తీర్ణంలో కౌలు **సాగు చేశాను. ఇంత వరకూ సుమారు రూ.15 లక్షల** పెట్టుబడి **పెట్టాను. పంట మొత్తం** కోతకు **వచ్చింది. వాతావరణ** పరిస్థితులు చూసి ఏం **చేయాలో దిక్కుతోచని** పరిస్థితి నెలకొంది. 30 బస్తాల **వరకూ దిగుబడి వస్తుందని** ఆశతో ఉన్నాం. ఇంత **కన్నా ఎక్కువ అవర్షం** కురిస్తే నష్టాలు తప్పవు.

– **నయినాల బ్రహ్మాజీ**, కౌలు రైతు, మామిడికుదురు

బరకాలు కూడా ఇవ్వలేదు



పదెకరాల విస్తీర్ణంలో ఖరీఫ్ పంట ఆశాజనకంగా ఉంటుందని ఆశిస్తున్నాం. కానీ వాతావరణం మా పాలిట శాపంగా మారింది. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షం మా ఆశలపై నీళ్లు చల్లేట్టు ఉంది. వాతావరణ శాఖ హెచ్చరికలు కలవరపెడుతున్నాయి. ప్రభుత్వం రాయితీపై ఇచ్చే బరకాలు ఇంత వరకూ రాలేదు. త్వరగా అందించాలి.

– **తాటికాయల ఉదయభాస్కర్**, రైతు, నగరం

అదనంగా ఖర్చు అయ్యింది



ఎకరం విస్తీర్ణంలో వరి పండించాను. రూ.25 వేల పైబడి పెట్టుబడి పెట్టాను. పంట కోత దశకు రావడంతో నాలుగు రోజుల కిందట కోత కోశాం. కోత కోసిన తర్వాత రోజు నుంచి వర్షం మొదలైంది. పనలపై ఉన్న పంట తడిసిపోకుండా ట్రాక్టరు సహాయంతో హైవే బైపాస్ రోడ్డుపై గుట్టగా వేసి బరకాలు కప్పించాం. అల్పపీడనంతో అదనంగా రూ.ఆరు వేలు ఖర్చయ్యింది.

– **నయినాల శ్రీరంగనాథం**, రైతు, మామిడికుదురు

మెరుగైన సేవలందించాలి

అంబాజీపేట: క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి మెరుగైన సేవలందించాలని రాష్ట్ర టీబీ ఏపీఓ జి.రవీంద్రకుమార్ అన్నారు. ముక్కామల పీహెచ్‌సీని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రవీంద్రకుమార్ మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే షుగర్, క్యాన్సర్ లాంటి తీవ్ర వ్యాధులు ఉన్నవారికి క్షయ నిర్ధారణ పరీక్షలు చేయాలన్నారు. క్షయ వ్యాధిగ్రస్తుల వివరాలను తెలుసుకుని వారికి మందులు అందించాలన్నారు. జిల్లా టీబీ ఎస్టీఎల్ఎస్ సీహెచ్ రామచంద్రరావు, సీహెచ్ఓ ఎం.రవికుమార్, ల్యాబ్ టెక్నీషియన్ జి.వల్లంశెట్టి, జి.సర్వారాయుడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మామిడికుదురు: 11 కేవీ లైన్లో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం మామిడికుదురు మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ గురువారం తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. దీనికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అలమూరు: చొప్పెల్ల, ఆలమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని రామచంద్రపురం ఈఈ కె.రత్నాలరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా పినపళ్ల, పెదపళ్ల, నర్శిపూడి, నవాబుపేట, గుమ్మిలేరు, మోదుకూరు, పెనికేరు, కలవచర్ల, ఆలమూరు, జొన్నాడ, మూలస్థాన అగ్రహారం, మడికి, చెముడులంక, చొప్పెల్ల తదితర గ్రామాలకు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు వరకూ సరఫరా ఉండదన్నారు.

రావులపాలెం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం రావులపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ తెలిపారు. రావులపాడు, కొమరాజులంక గ్రామాలు, రావులపాలెం గ్రామ పరిధిలోని పలు ప్రాంతాలకు, ఊబలంక పరిధిలోని వ్యవసాయ విద్యుత్ మోటార్లకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ సరఫరా ఉండదన్నారు.

నెహ్రూ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం

అంబాజీపేట: తొలి ప్రధాని స్వర్గీయ జవహర్‌లాల్ నెహ్రూ ప్రతి ఒక్కరికీ ఆదర్శం కావాలని హెచ్ఎం కడలి సాయిరామ్ అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో గురువారం నెహ్రూ జయంతి వేడుకలను నిర్వహించారు.

సఖినేటిపల్లి: అంతర్వేదికర జెడ్పీ హైస్కూల్ వద్ద జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్ఎం పడాల సోమసూర్యకుమారి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అలాగే ఆటల, వ్యాసరచన పోటీలు, డిబేటింగ్ తదితర ఈవెంట్స్‌లలో విజేతలకు బహుమతులు అందజేశారు.

మలికిపురం: లక్కవరం సెవెంత్ డే ఎడ్వాండిస్ట్ హైస్కూల్ వద్ద ఫస్ట్‌క్లాస్ చదువుతున్న స్టాలిన్‌ను యాజమాన్యం సత్కరించింది. స్టాలిన్‌లో ఉన్న మేధా సంపత్తిని గుర్తించి కరస్పాండెంట్ పాస్టర్ నరసింహరాజు సత్కరించారు. సెవెంత్ డే స్కూల్ బెస్ట్ ఆర్టిస్ట్ అవార్డు బహూకరించారు.

ఆలమూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, ఎంపీడీఓ ఎ.రాజు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్ టి.సుబ్బరాజు, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై ఎం.అశోక్ తదితరులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేశారు. విద్యార్థుల జాతీయ నాయకుల వేషధారణ ఆకట్టుకుంది.

మామిడికుదురు: బాలల దినోత్సవాన్ని మామిడికుదురులో ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి హెచ్ఎం డీవీవీ సత్యనారాయణ, యక్కుదేవర నాగన్నబాబు పూలమాలలు వేశారు. విద్యార్థులు నెహ్రూ వేషధారణలతో ఆటలు ఆడి పాటలు పాడారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.



చెముడులంకలో నిర్వహించిన బాలల దినోత్సవానికి హాజరైన విద్యార్థులు

108 వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించాలి



మామిడికుదురులో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న 108 ఉద్యోగులు



పి.గన్నవరంలో తహసీల్దార్ శ్రీపల్లవికి వినతిపత్రం అందజేస్తున్న 108 సిబ్బంది

కొత్తపేట: ప్రమాద, అనారోగ్య బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించి, తదుపరి వైద్యం నిమిత్తం ఆస్పత్రులకు తరలిస్తున్న 108 వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించాలని ఆ ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తపేటలో తహసీల్దార్ రాంబాబుకు వినతిపత్రం సమర్పించారు. ఆ సిబ్బంది మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినప్పుడల్లా 108 నిర్వహణ సంస్థలు మారుతున్నాయని, ఆ సందర్భంలో ఉద్యోగులకు ఇవ్వాల్సిన ఆర్జిత సెలవులు, గ్రాడ్యుటీ, పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించకుండా ఎగ్గొట్టి అన్యాయం చేస్తున్నారని వాపోయారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ నెల 25 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని తెలిపారు.

డిమాండ్లు పరిష్కరించాలి

మామిడికుదురు: నగరం పీహెచ్‌సీ పరిధిలో 108 కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం తహసీల్దార్ వైవీ సుబ్రహ్మణ్యం ఆచార్యులు, ఏఓ కె.వెంకటేశ్వరరావుకు వినతి పత్రాలు ఇచ్చారు. 108 సర్వీసులను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని, అధికారులు ఇచ్చిన హామీ మేరకు స్లాబ్‌లకు అనుగుణంగా వేతనాలు చెల్లించాలని, సర్వీసును బట్టి ఎప్పటికప్పుడు స్లాబ్‌లను అప్‌గ్రేడ్ చేయాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు.

అయినవిల్లి: 108 అంబులెన్స్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మకు వినతి పత్రం అందజేశారు. తమను వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగులుగా గుర్తించాలని, జీఓ ఎంఎస్ నంబర్ 49ని పునరుద్ధరించాలని కోరారు. వీరి వెంట జిల్లా 108 వర్కింగ్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, ఈఎంటీ మహేష్ తదితరులు ఉన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక 108 సిబ్బంది పి.గన్నవరంలో తహసీల్దార్, ఎంపీడీఓ శ్రీపల్లవి, కేవీ ప్రసాద్‌లకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ నెల 25 నుంచి సమ్మె చేస్తున్నట్టు 108 సిబ్బంది తెలిపారు. వినతి పత్రాలు సమర్పించిన వారిలో ఈఎంటీ బి.సుభాకర్, పైలట్స్ ఎం.రమేష్, పి.ప్రవీణ్ ఉన్నారు.

రావులపాలెం: తమ సమస్యల పరిష్కారానికి ఈ నెల 25 నుంచి సమ్మెకు దిగుతున్నట్టు రావులపాలెం 108 సిబ్బంది అధికారులకు సమ్మె నోటీసులు అందజేశారు. రావులపాలెం తహసీల్దార్ ముక్తేశ్వరరావు, ఎంపీడీవో మహేశ్వరరావుకు సమ్మె నోటీసులు అందజేసినట్టు చిట్టిబాబు, నాగరాజు, రత్నకుమార్ తదితరులు తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బిక్కిన, వైద్యాధికారి

ఆలమూరు: స్థానిక బాలుర సమీకృత వసతి గృహం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ జరిగింది. పినపళ్ల పశు వైద్యాధికారి ఈదల శ్రీనివాస్‌చౌదరి జన్మదిన సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జున చౌదరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు సమస్యలను తెలుసుకుని తమ వంతు పరిష్కారానికి హామీ ఇచ్చారు. అనంతరం

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం

అంబాజీపేట: రీ సర్వేతో భూములకు సంబంధించి ఎటువంటి సమసలున్నా గ్రామ సభల ద్వారా పరిష్కరించవచ్చని తహసీల్దార్ జె.వెంటేశ్వరి అన్నారు. వాకలగరువు, తొండవరం సచివాలయాల వద్ద రెవెన్యూ గ్రామ సభలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రీ సర్వేలో ఆర్ఎస్ నంబర్‌కు బదులుగా ఎల్‌పీ నంబరును ప్రభుత్వం కేటాయిస్తుందన్నారు. ఈ మార్పును రైతు లు గమనించాలని సూచించారు. రైతుల సమస్యలు, అభ్యంతరాలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ సభలు దోహదపడతాయన్నారు. రీ సర్వేకు భూ యజమానులు సహకరించాలని కోరారు. సర్పంచ్ పేరాబత్తుల దొరబాబు, ఎంపీటీసీ సభ్యులు వాకపల్లి దొరబాబు, వడ్లమాని పద్మావతి, పితాని వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కాత్యాయని

కొత్తపేట: మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ కే కాత్యాయని ఉద్బోధించారు. గురువారం స్థానిక సిద్ధార్థ జూనియర్, శతాబ్ది డిగ్రీ కళాశాలల విద్యార్థులకు 'మాదక ద్రవ్యాలు వద్దు.. ఉజ్వల భవిష్యత్ ముద్దు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ఏఓ రెడ్డి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సదస్సులో సీఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను విక్రయించి అక్రమ మార్గంలో ధన సంపాదనే లక్ష్యంగా కొందరు కళాశాలల్లో విద్యార్థులను మత్తులోకి దించుతున్నారని అన్నారు. ముందుగా ఒకరిద్దరు విద్యార్థులను లోబరుచుకుని, వారి ద్వారా ఇంకొందరిని మత్తు పదార్థాలకు బానిసలుగా మారుస్తున్నారని తెలిపారు. అటువంటి అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ కానిస్టేబుళ్లు సత్తిరాజు, రహమతుల్లా పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

కొత్తపేట: బిళ్లకుర్రు గ్రామ సచివాలయం వద్ద శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఆ గ్రామ సర్పంచ్ నెల్లి లక్ష్మీపతిరావు తెలిపారు. అమలాపురం మెడ్ యునైటెడ్ హాస్పటల్స్ సౌజన్యంతో నిర్వహించే ఈ శిబిరంలో కార్డియాలజీ, ఆర్థోపెడిక్, డెంటల్, జనరల్ మెడిసిన్ ఆప్తమాలజీ విభాగాలకు సంబంధించి వైద్యులు గురుకిరణ్, మల్లిక, జోయ్‌సస్ తదితరులు వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరారు.

పుస్తక పఠనంతో విజ్ఞాన సముపార్జన

అంబాజీపేట: పుస్తక పఠనంతో విజ్ఞాన సముపార్జన సాధ్యమని ఎంఈఓ-2 మోకా ప్రకాష్, హెచ్ఎం కడలి సాయిరామ్ అన్నారు. అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం గ్రంథాలయాల వారోత్సవాలను ప్రారంభించారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించారు. అనంతరం మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చితపటానికి పూలమాలలు వేశారు. ఉపాధ్యాయుడు నందిక వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: అంతర్వేదిపాలెం శాఖా గ్రంథాలయంలో మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు జరిగాయి. చిన్నారులకు వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం జాన కనక లింగేశ్వరరావు, గ్రంథాలయ నిర్వాహకురాలు వై.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

మామిడికుదురు: స్థానిక శాఖా గ్రంథాలయంలో ప్రధాన ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కొమ్ముల వీరరాఘవరావు వారోత్సవాలను ప్రారంభించారు. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి సీనియర్ పాఠకుడు కె.జవహర్ పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి ఎ.సూర్యనారాయణ, ఈదరాడ, పాశర్లపూడి బీడీసీలు యెరుబండి కన్నబాబు, ఎస్‌టీఎల్ దేవి పాల్గొన్నారు.

మలికిపురం: స్థానిక గ్రంథాలయ అధికారి బి.నాగేంద్ర కుమార్ ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలను ఎంఈఓ వైవీవీ సత్యనారాయణ ప్రారంభించారు. విద్యార్థులకు గ్రంథాలయాలు, ఆధునిక విజ్ఞాన దేవాలయాలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఏఎఫ్‌డీటీ స్కూల్ హెచ్ఎం జీవీఎస్ శ్రీనివాసరాజు, యూపీ స్కూల్ హెచ్ఎం ఏవీవీ సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు. కేశనపల్లి శాఖా గ్రంథాలయంలో అధికారి ఇందిర ఆధ్వర్యంలో వారోత్సవాలు ప్రారంభించారు. వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను యర్రంశెట్టి గోపాలకృష్ణ ఆవిష్కరించారు.

పి.గన్నవరం: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ప్రసాద్ అన్నారు. పి.గన్నవరం శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలను లైబ్రేరియన్ జి.రవికుమార్ ప్రారంభించారు. కార్యక్రమాల్లో లిటిల్ ఏంజల్స్ స్కూల్ కరస్పాండెంట్ జోమి వర్గీస్, విశ్రాంత ఉపాధ్యాయుడు సాకా సత్యం, గుడాల సంపద రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: విద్యార్థులు పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం పెంపొందించుకోవాలని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు సూచించారు. గ్రంథాలయ వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఇక్కడ పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. లైబ్రరీ ఇన్‌చార్జి సీహెచ్ నాగరాణి, లైబ్రేరియన్ ఎన్‌వీవీ జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: స్థానిక గ్రంథాలయం వద్ద వారోత్సవాలను గ్రంథాలయ అధికారి తమ్మా నమశ్శివాయ ఆధ్వర్యంలో ఎంపీడీవో రామన్ ప్రారంభించారు. గ్రంథాలయ ఆవరణలో నెహ్రూ, అయ్యంకి వెంకటరామయ్య, అల్లూరి సీతారామరాజు చిత్రపటాలకు ఆయన పూలమాలలు వేశారు. అనంతరం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు, పాఠకులకు బిస్కెట్లు, స్వీట్లు పంచారు.



అంబాజీపేటలో గ్రంథాలయ వారోత్సవాల్లో మాట్లాడుతున్న ఎంఈఓ ప్రకాష్



అంతర్వేదిపాలెంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తూ..



మలికిపురం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

సౌండ్ సిస్టం బహూకరణ

రావులపాలెం: ఈతకోటలోని హైస్కూల్‌కు దాత వి.పాపారావు రూ.43 వేల విలువైన సౌండ్ సిస్టంను బహూకరించినట్టు హెచ్ఎం కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం పాఠశాలలో జరిగిన బాలల దినోత్సవ వేడుకల్లో దీనిని ప్రారంభించామన్నారు.

జెడ్పీ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

అమలాపురం రూరల్ : మండలంలో వన్నెచింతలపూడి జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్‌కే సలీంబాషా గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని కొద్దిసేపు విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివి భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని ఉద్బోధించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బీసీ గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడారు. డీఈఓ వెంట సీఎంఓ బొరుసు సుబ్రహ్మణ్యం, డీవైఈవో గుబ్బల సూర్య ప్రకాశరావు, హెచ్ఎం నాగ సత్యనారాయణ ఉన్నారు.

రోడ్ల పనుల పరిశీలన

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలో గురువారం సీసీ రోడ్లు, డ్రైనేజీల పనులు జరుగుతున్నాయి. ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద సుమారు రూ 25 లక్షలతో చేపట్టిన ఈ పనులను మండల ఇంజినీరింగ్ శాఖాధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. సర్పంచ్ తోట భవానీ, ఎంపీటీసీ తోలేటి సంతోషి, దొడ్డా సుబ్బారావు, నల్లా వెంకన్న, తోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



దాత సత్యనారాయణరెడ్డికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి రావులపాలెం వాస్తవ్యుడు పడాల సూర్య వెంకట సత్యనారాయణరెడ్డి, సరిత దంపతులు గురువారం రూ.10 వేలు విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకుడు వినాయకరావుకు ఇచ్చారు. దాతను సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

మోటార్ సైకిల్ చోరీ

అయినవిల్లి: తన మోటార్ సైకిల్‌ను అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి ఆలయం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని అల్లవరపు వీరవెంకట సత్యనారాయణ మూర్తి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సై జోషికుమార్ కథనం ప్రకారం.. స్థానిక విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామివారి ఆలయ అర్చకులుగా సత్యనారాయణ మూర్తి పని చేస్తున్నారు. ఈ నెల 12న ఆలయానికి వచ్చి వెలుపల తన బైక్‌ను పార్కింగ్ చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు తన మోటార్ సైకిల్‌ను చోరీ చేసినట్లు ఆయన ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

అంబాజీపేట: గంగలకుర్రులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. అమలాపురం రూరల్ మండలం బండారులంకకు చెందిన బట్టు పుల్లేశ్వరరావు (పండు)తో పాటు పలువురు ఇటీవల అయ్యప్ప మాల స్వీకరించారు. స్థానిక అయ్యప్ప పీఠం నుంచి గంగలకుర్రు కుమ్మరిపాలెంలో బుధవారం రాత్రి జరుగుతున్న కలశ పూజకు స్వాములు వెళ్తున్నారు. గంగలకుర్రులోని మోరంవారిపాలెం వద్దకు వచ్చేసరికి ఓ భవనం ఎదురుగా రహదారికి అడ్డంగా ఇసుక ఉంది. దీంతో మోటారుసైకిల్ అదుపు తప్పడంతో ఒక్కసారిగా కింద పడి పుల్లేశ్వరరావు తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెనకాలే మరో బైక్‌పై వస్తున్న అయ్యప్ప స్వాములూ పడిపోయి గాయాల పాలయ్యారు. తీవ్ర గాయాలైన పుల్లేశ్వరరావును చికిత్స నిమిత్తం కాకినాడలోని ఓ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.